క్లుప్తంగా

ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం

కురిచేడు: శ్రీ విశ్వావసు నామ ఉగాది సందర్భంగా పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు సనాతన ధార్మిక సంఘ అధ్యక్షుడు స్వయంపాకుల యలమందల కోటేశ్వరశర్మతో పంచాంగ శ్రవణం, విశ్లేషణ ఉంటుందని ఆలయ పూజారి నారాయణం వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ చైర్మన్ కొత్త వెంకట అయ్యప్పశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. దర్శి రోడ్డులోని శ్రీ మదివ్రాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అనంతరం పంచాంగ శ్రవణం ఉంటుందని ఆలయ పూజారి జూపూడి భువనేశ్వరాచారి తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కటకానిపల్లె పొలాల్లో పేకాడుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మహేష్ కథనం ప్రకారం.. గ్రామ పరిసరాల్లో పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారంతో దాడి నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 9700 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో చట్ట వ్యతిరేకంగా జూదం ఆడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో కాటమరాజుస్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో వేనూతల కాటమరాజుస్వామి



అలంకరణలో గంగాభవానీ అమ్మవార్లు



పెద్దారవీడులో బొల్లావును ఊరేగిస్తున్న యాదవులు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీ నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేనూతల కాటమరాజుస్వామి, గంగభవానీ అమ్మవార్ల తిరునాళ్ల శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌కు పట్టువస్త్రాలు, పూలమాలతో శోభాయమానంగా అలంకరించారు. మహిళలు స్నానాలు అచరించి కొత్త కుండలో నైవేద్యం తయారు చేసి పొంగళ్లు పెట్టారు. అనంతరం నైవేద్యం తయారు చేసిన కుండను ప్రత్యేకంగా పూజించి పొంగుళ్లు స్వామికి సమర్పిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని, సంకల్పం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని బొల్లావును యాదవులు నెత్తిన పెట్టుకొని కొమ్ముబూరగ ఊదుతూ, తప్పెట్ల మధ్య నృత్యం చేసుకుంటూ ఈలలు, కేకలు వేసుకుంటూ ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మొక్కుబడులు ఉన్న మహిళలు గంగాభవానీ అమ్మవార్లకు పట్టుచీరలు, పసుపు, కుంకుమ సమర్పించారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఉత్సవ ప్రాంగణం కిక్కిరిసింది. వివిధ రంగులతో కూడిన బొల్లావులు ప్రత్యేక అకర్షణగా నిలిచాయి. తిరునాళ్లకు వచ్చిన భక్తులు చెరుకులు లేనిదే తిరుగు ప్రయాణం చేయరు. భక్తుల రద్దీ భారీగా ఉండటంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. జిల్లాతో పాటు రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు అత్యంత నమ్మకంతో తిరునాళ్లకు తరలి వచ్చి మొక్కుబడులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు అలంకరించి ఆలయ ఆవరణంలో ఊరేగింపు ఉత్సవ భరితంగా సాగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అన్నదానం చేశారు. తిరునాళ్ల ఉత్సవాల్లో భాగంగా రాత్రి భక్తులకు కాలక్షేపానికి నాలుగు విద్యుత్ ప్రభలు, కోలాటం, నాటకాలు ప్రదర్శించారు.

బొల్లావుకు ప్రత్యేక పూజలు

మండలంలోని గుండంచర్ల, కలనూతల, సుంకేసుల గ్రామాలు బంధువులతో సందడిగా మారాయి. శనివారం పలు గ్రామాల్లో బొల్లావుకు పూలమాల, వీరతాళ్లతో అలంకరించి ఇంట్లో మహిళలు తయారు చేసిన నైవేద్యం, పసుపు, కుంకుమ, కాయకర్పూరం సమర్పించారు. ఉగాది వస్తుందంటే యాదవుల ఇంటిల్లపాదీ అనందోత్సాహంతో మునిగిపోయారు. మధ్యాహ్నం నుంచి గ్రామాల్లో యదవ సోదరులు నెత్తిన పెట్టుకున్న బొల్లావు ముందు కొమ్ముబూర ఊదుతూ, తప్పెట్ల మధ్య చుట్టూ తిరుగుతూ సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఈలలు, కేరింతలు కొడుతూ ప్రజలను అకట్టుకున్నారు. బొల్లావు ఊరేగింపు సమయంలో ఎత్తుకునేందుకు చిన్న, పెద్ద తేడా లేకుండా పోటాపోటీ పడుతూ వీధుల్లో విన్యాసాలు చేస్తూ అనందోత్సాహంతో మునిగిపోయారు. కుంటుంబ సమేతంగా ఊరి చివర వరకు బొల్లావు ఊరేగింపులో పాల్గొని భక్తులను సంతోషంగా సాగనంపారు. అక్కడి నుంచి లారీలు, ఆటోలు, ట్రాక్టర్లు తదితర వాహనాల్లో ఆలయానికి బయల్దేరారు.

మట్టి నమూనా సేకరణపై అవగాహన

కురిచేడు: పొలాల్లో మట్టిని సేకరించి పరీక్షకు ఎలా పంపాలో దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ రైతులకు శనివారం అవగాహన కల్పించారు. మండలంలోని బోధనంపాడులో ఆయన వ్యవసాయాధికారి పి.మధుబాబుతో కలిసి రైతులతో మాట్లాడారు. మట్టి నమూనా తీయదలచిన పొలంలో 10–12 చోట్ల 6 అంగుళాల లోతు వరకు వి ఆకారపు గుంతలు తీసి గుంతపై నుంచి దిగువ వరకు ఒక అంగుళం మందంలో పలుచని పార వచ్చే విధంగా మట్టిని సేకరించాలన్నారు. అలా సేకరించిన మట్టిని గోనెపట్ట లేక పాలిథిన్ షీట్‌పై వేసి బాగా కలిపి చతుర్విభజన పద్ధతిలో అర కిలో మట్టి మిగిలే వరకు చేయాలి. ఇలా సేకరించిన మట్టిని శుభ్రమైన పాలిథిన్ సంచిలో వేసి మట్టి నమూనా వెంట పంపాల్సిన సమాచారంతో భూసార పరీక్ష కోసం సిద్ధం చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

భూమి ధృవీకరణ గ్రామసభ

దొనకొండ: స్థానిక వీర వెంకటాపురంలో రీ సర్వే పైలెట్ విలేజ్ గ్రామసభను రెవెన్యూ అధికారులు శనివారం నిర్వహించారు. సభకు తహసీల్దార్ బి.రమాదేవి హాజరై మాట్లాడారు. గతంలో వీర వెంకటాపురం రెవెన్యూ గ్రామంలో రీ సర్వే పూర్తి చేశామన్నారు. రీ సర్వేలో వ్యత్యాసాలు, తేడాలు ఉంటే గ్రామసభలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పాస్ పుస్తకంలో నమోదైన భూమిని రీ సర్వేలో వ్యత్యాసాలు ఉంటే సంబంధిత రైతులను పిలిపించి న్యాయం చేస్తామన్నారు. రైతులకు 9(2) నోటీసులు ఇచ్చామని, దీని ద్వారా రెవెన్యూ సిబ్బంది విస్తీర్ణం తెలియపరిచామన్నారు. ఎవరైనా అభ్యంతరాలు ఉంటే 9(2) ద్వారా అప్పీలు చేసుకోవచ్చని తహసీల్దార్ రైతులకు వివరించారు. కొంతమంది రైతులు తమ సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కేవీ నాగార్జునరెడ్డి, వీఆర్‌ఓ మాచర్ల, సచివాలయం సర్వేయర్ ఎం.శ్రీనివాసులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

● సీనియర్ సివిల్ జడ్జి శివశంకర్‌రెడ్డి

ముండ్లమూరు (దర్శి): పోక్సో చట్టంపై బాలబాలికలు, తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పులిపాడులో శుక్రవారం రాత్రి న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల రక్షణ కోసం 2012లో పోక్సో చట్టం వచ్చిందన్నారు. 18 ఏళ్ల లోపు బాలబాలికలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, అసభ్యకర చిత్రాలు చూపించినా అటువంటి వారిపై చట్టం వర్తిస్తుందన్నారు. మైనర్‌ల ప్రైవేటు పార్ట్‌లు టచ్ చేసినా పోక్సో చట్టం కింద శిక్షిస్తారని చెప్పారు. ఎవరైనా తమ పట్ల ఆ విధంగా ప్రవర్తిస్తున్నారని బాలికలు గమనిస్తే వెంటనే తమ తల్లిదండ్రులకు చెప్పి పోక్సోచట్టం కింద కేసు పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వారు చట్టాలు తెలుసుకుంటే తమకు జరిగే న్యాయంపై కొంత అవగాహన కలుగుతుందన్నారు. బాలబాలికలు చిన్న వయసులోనే చట్టాలు తెలుసుకుంటే నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉంటాయన్నారు. చట్టాలు తెలుసుకుని తోటి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. బడి ఈడు పిల్లలు చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు, తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఒక గోల్ ఎంచుకుని సాధించే వరకు కష్టపడాలన్నారు. చిన్న వయసులో కష్టపడితే పెద్దయ్యాక ఉన్నత శిఖరాలు అవరోధించవచ్చని సూచించారు. గ్రామాల్లో చిన్న చిన్న విషయాలకు తగాదాలకు పోయి అవి పెద్దవి చేసుకుని కోర్టులకు వెళితే సమయం, డబ్బు వృథా అవుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలు సమన్వయంతో మెలిగి గ్రామంలో ఆదర్శవంతంగా నిలవాలని సూచించారు. న్యాయవాదులు మారం రాజశేఖరరెడ్డి, ఎన్.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివశంకర్‌రెడ్డి

నవోదయ పరీక్షలో విద్యార్థి ప్రతిభ



సాహిల్‌ను అభినందిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

పెద్దారవీడు: జవహర్ నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్షలో మండలంలోని ఓబులక్కపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి షేక్ సాహిల్ ప్రతిభ చాటారని ప్రధానోపాధ్యాయుడు పి.ప్రభాకర్ శనివారం తెలిపారు. ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చని, మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థికి నవోదయ కోచింగ్ ఇచ్చి ప్రతిభ చాటేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల చైర్మన్ దుగ్గెంపుడి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టర్ బాలరాజుకు నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ బాలరాజు

పెద్దారవీడు: ఉగాదిని పురస్కరించుకొని మేఘ హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బద్వీడుచెర్లోపల్లి గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు డాక్టర్ పడిదపు బాలరాజు చౌదరికి హైదరాబాద్‌లో శనివారం నంది అవార్డు ప్రదానం చేశారు. గోల్డ్ మెడల్ అందజేసి శాలువాతో సత్కరించారు. మండలంలో పలుచోట్ల మెడికల్ క్యాంపులు, పేదలకు అన్నదానం, మరోన్న సేవలను గుర్తించి మేఘ హెల్పింగ్ పౌండేషన్ నంది అవార్డు ఇచ్చిందని బాలరాజు తెలిపారు. అవార్డు తీసుకున్న ఆయన్ను గ్రామీణ ప్రాంత ప్రజలు అభినందించారు.

25 అంశాలు ఆమోదం



సమావేశానికి హాజరైన సభ్యులు

దర్శి: నగర పంచాయతీలో 25 అంశాలకు ఆమోదం తెలిపి తీర్మానం చేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ మహేష్ తెలిపారు. శనివారం నగర పంచాయతీ సమావేశం చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూళ్ల కోసం నగర పంచాయతీ కార్యాలయంలో మొబైల్ కౌంటర్‌లు, ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. సెలవు దినాల్లో కూడా ఆస్తి పన్ను కట్టించుకుంటామన్నారు. ఆస్తి పన్ను కట్టాల్సిన వారు 50 శాతం వడ్డీ రాయితీ పొంది పన్ను కట్టవచ్చని తెలిపారు. ఈ అవకాశం పన్ను కట్టాల్సిన వారందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

పాస్టర్ల శాంతియుత ర్యాలీ



పెద్దదోర్నాలలో ర్యాలీ చేస్తున్న పాస్టర్లు

పెద్దదోర్నాల: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ మండల పాస్టర్స్ యూనియన్ అండ్ ఇవాంజిలిస్ట్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో క్రైస్తవ సోదరులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పూర్ణకంటి జేమ్స్ మాట్లాడుతూ భవిష్యత్తులో క్రైస్తవులపై ఇటువంటి చర్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంఘటనపై న్యాయం చేయాలని కోరారు. ర్యాలీలో బొప్పూరి ప్రభుదాస్, సింగా ఏసన్న, చాట్ల గంగయ్య, యేహాన్, తంగిరాల యాకోబ్, ఎలకపాటి ఇజ్రాయేల్, పాస్టర్ అగస్టీన్, సింగా ఏసుదానం, రూబెన్, శాంసన్,డేవిడ్‌రాజు, ఎలకపాటి రాజు, బాబూరావు, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

తాళ్లూరు: విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని జీసీడీఓ కె.హేమలత అన్నారు. స్థానిక కేజీబీవీ కళాశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. వంటశాలలను పరిశీలించారు.